'బావుపేటను మండలం చేయాలి'

భగత్‌నగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బావుపేట (ఆసిఫ్‌నగర్)ను మండల కేంద్రం చేయాలని కోరుతూ కొత్తపల్లి మండలంలోని కాంగ్రెస్ మండల కమిటీ పంజాల స్వామిగౌడ్ ఆధ్వర్యంలో అన్ని గ్రామ శాఖల నాయకులు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆదివారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు లక్ష్మయ్య, శ్రీనివాస్, చంద్రయ్య, మనోహర్, ప్రభాకర్, రాజగౌడ్, అనిల్, జేఏసీ నాయకులు ఒల్లాల కిషోర్, పిల్లి మహేష్, దూలం మధు పాల్గొన్నారు.



అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకందేలా అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా కార్యాచరణ ప్రణాళిక సమీక్షా సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయానికి యోగ్యమైన భూమికి పంట వేసినా, వేయకపోయినా రైతు భరోసా కింద సంవత్సరానికి 12 వేల రూపాయలు అందిస్తామన్నారు. సమావేశం సందర్భంగా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఒక దశలో తోపులాట వరకు వెళ్లింది. వేదికపై ఉన్న ఎమ్మెల్యేలు అడ్డుకుని అక్కడి నుంచి కౌశిక్‌రెడ్డిని బయటకు పంపించారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్‌కుమార్ తన పదవికి రాజీనామా చేయాలన్నారు. దమ్ముంటే కాంగ్రెస్ బీఫాంతో పోటీ చేసి గెలిచి చూపాలని సవాల్ విసిరారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ తనను ప్రశ్నించే అధికారం కౌశిక్‌రెడ్డికి లేదన్నారు. తాను కాంగ్రెస్‌లోనే ఉన్నానని, ఆ పార్టీ ఎమ్మెల్యేగానే కొనసాగుతానని స్పష్టం చేశారు.

◆ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

5వ పేజీలో..

కౌశిక్ రెడ్డి X సంజయ్‌కుమార్



ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, సంజయ్ కుమార్ మధ్య వాగ్వాదం



పాల్గొన్న అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కౌశిక్ రెడ్డి, మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మేయర్ సునీల్‌రావు

హాస్టల్ సంక్షేమ అధికారుల
సమస్యలు పరిష్కరించాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందచేస్తున్న టీఎస్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

సుభాష్‌నగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ సంక్షేమ అధికారుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. తిమ్మాపూర్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రేవా, ఏ ఎస్ డబ్ల్యూ విజయ్‌పాల్‌రెడ్డి సంస్పెండ్ అంశాన్ని ఆదివారం రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ సక్రమంగా హాస్టల్స్ నిర్వహిస్తున్న అధికారులపై కొంతమంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టీఎస్జీవోస్ కోశాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, కేంద్ర సంఘం నాయకుడు గూడ ప్రభాకర్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్, హాస్టల్ వెల్ఫేర్ ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్
బకాయిలను విడుదల చేయాలి


- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్

గణేశ్‌నగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బకాయిల విడుదల కోసం విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు ఎదురు చూస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా విద్యార్థుల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. గురుకులాల్లో వరుసగా ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురైనా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు.

బొమ్మకల్ ఎక్స్ రోడ్డు వద్ద
స్టాపర్లను ఏర్పాటు చేయాలి



హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న బొమ్మకల్ గ్రామస్థులు

కరీంనగర్ రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బొమ్మకల్ గ్రామంలో ఎక్స్ రోడ్డు వద్ద స్టాపర్లను ఏర్పాటు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు బొమ్మకల్ గ్రామస్థులు ఆదివారం వినతి పత్రం అందించారు. లారీ అసోసియేషన్ వద్ద గల ఎక్స్ రోడ్డు మధ్యలో ఉన్న మొక్కలను తొలగించాలన్నారు. రోడ్డు దాటే క్రమంలో వాహనాలు వేగంగా రావడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. చల్మెడ ఆనందరావు వైద్య కళాశాల వద్ద స్టాపర్లను ఏర్పాటు చేయాలని, రహదారికి ఇరువైపులా భారీ వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి, కేంద్ర రైల్వే బోర్డు మెంబర్ పాశం తిరుపతి,చిందం మహేష్, గోస్కుల రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముచ్చటైన మూడురోజుల పండుగ

- నేడు భోగి, రేపు సంక్రాంతి, 15న కనుమ

కరీంనగర్ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారు మూడు రోజులు జరుపుకునే ముచ్చటైన పండుగ సంక్రాంతి.సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించిన రోజు మకర సంక్రాంతిగా పాటిస్తారు. ధనుర్మాసం పూర్తయి సూర్యుడు దక్షిణం నుంచి ఉత్తరం వైపుతిరిగే ఉత్తరాయణ పుణ్యకాలమే సంక్రాంతి. మార్గశిర, పుష్య మాసాల సంధికాలంలో హేమంత ఋతువులో వచ్చే ఈ పండుగ మూడు రోజులుగా (సోమవారం భోగి, మంగళవారం సంక్రాంతి, 15న కనుమ) జరుపుకుంటారు. భోగి భాగ్యానికి, సంక్రాంతి సంపదకు, కనుమ కలిమికి చిహ్నంగా చెప్పే ఈ పండుగకు జనులు స్వాగతం పలుకనున్నారు.



భోగ్యమైన భోగి..

భోగికి పది రోజుల ముందు నుంచే భోగి పిడుకలు పెట్టి మధ్యలో రంధ్రం చేసి హారంగా తయారు చేస్తారు. పిడుకల హారంతోపాటు ఇంట్లోని నిరుపయోగ వస్తువులు, పాత సామానులు భోగి మంటల్లో వేస్తారు. విభూతి ధరిస్తారు. చిన్న పిల్లలకు రేగుపళ్లు, రాగి నాణేలు, చెరుకు ముక్కలు, నువ్వులు, పిండి వంటలు కల్పి తలపై నుంచి జారే విధంగా భోగి పళ్లు పోస్తారు.

పుణ్యప్రద సంక్రమణం..

సంక్రాంతి లక్ష్మీ ఆగమనానికి సంకేతం. శ్రీమన్నారాయణుడితో కలిసి లక్ష్మీదేవి రంగురంగుల ముగ్గుల రథానెక్కి వస్తుందంటారు. ఈ రోజు ముగ్గులకు ఎంతో ప్రాశస్త్యం ఉంది. లక్ష్మీతో పాటు సంక్రాంతి పురుషుడు, బలి చక్రవర్తి ఇంటికి వచ్చి శుభాలనిస్తారనే భావనతో ప్రతి ఇంటిని ఆవు పేడతో శుభ్రంగా అలికి, ముగ్గులు పెట్టి, పసుపు కుంకుమలతో గొబ్బెమ్మలను తయారు చేస్తారు. కూరపిండి ఆకు, రేగుపళ్లు, నువ్వులు ముగ్గులో ఉంచుతారు. రాక్షసుల బాధ భరించలేని లక్ష్మీదేవి గోమయంలో దాగి ఉండగా ఆ రూపమే గొబ్బెమ్మ అని చెప్పుతూ పూజించే సాంప్రదాయం అనాదిగా వస్తోంది.

రైతుల పండుగ కనుమ ..

సంక్రాంతి మరుసటి రోజు కనుమ రైతులకు సంబంధించిన పండుగ. సంవత్సరమంతా తమతో కష్టపడిన పశువులను పూజించడంలో భాగంగా ఎద్దుల కొమ్ములకు రంగులు వేసి ముద్దుగా ముస్తాబు చేస్తారు. గిట్టలను కడిగి పసుపు కుంకుమలతో అలంకరిస్తారు. పశువుల శాలలను పేడతో అలిగి ముగ్గులు పెట్టి పొంగలి వండి పాలు పొంగిస్తారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై చర్య తీసుకోవాలి

- పోలీసులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లయ్య ఫిర్యాదు



వన్‌టౌన్ సీఐకి కౌశిక్ రెడ్డిపై ఫిర్యాదు చేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తనను అవమానించే విధంగా మాట్లాడిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదివారం రాత్రి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లయ్య కరీంనగర్ వన్‌టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కలెక్టరేట్ ఆడిటోరియంలో సమీక్షా సమావేశంలోకి రాగానే ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హటాత్తుగా తనను అడ్డుకుని, షర్ట్ కాలరు పట్టుకుని అరుస్తూ నెట్టివేశాడన్నారు. సమావేశానికి నిన్ను ఎవరు పిలిచారని, ఎందుకు వచ్చావని అడుగుతూ దూషించాడన్నారు. హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల ముందు తన పరువు తీశాడని ఆవేదన వ్యక్తం చేశారు. తన వ్యక్తిగత పరువుకు భంగం కలిగించేలా ప్రవర్తించిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, బొమ్మ శ్రీరాంచక్రవర్తి ఉన్నారు.

- కరీంనగర్ ఆర్డీవో కె మహేశ్వర్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారిక సమవేశంలో రాజకీయ వ్యాఖ్యలు చేసి సమావేశానికి అంతరాయం కలిగించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

స్వామి వివేకానంద ఆశయ సాధనకు కృషి

- అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్
- ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

గణేశ్‌నగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జాతీయ యువజన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ మాట్లాడుతూ యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించే వరకు కష్టపడాలన్నారు. కార్య క్రమంలోఅడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్, డీఆర్వో పవన్ కుమార్, ఆర్డీవో ఉమా మహేశ్వర్, ఏవో సుధాకర్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, జాతీయ యువజన అవార్డు గ్రహీతలు ఎ కిరణ్‌కుమార్, కళింగ శేఖర్, శ్రీనివాస్, యువజన క్రీడా సంఘాల ప్రతినిధులు రమేష్‌రెడ్డి, సంపత్‌రెడ్డి తెలియజేశారు.



జాతీయ యువజన దినోత్సవంలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్, వివిధ శాఖల అధికారులు

గురుకులాల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

గణేశ్‌నగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వము ముద్రిం చిన గురుకులాల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ పోస్టర్‌ను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యా ర్థులు గురుకులాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. గురుకులాల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ఇక్కడ చదివే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. కార్యక్రమంలో గురుకులాల జిల్లా కో ఆర్డినేటర్, మానకొండూర్ మండలం దేవంపల్లి ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం, మొగురం రమేష్ , రాకేష్, కిషన్ పాల్గొన్నారు.

ఘనంగా గోదా రంగనాథస్వామి కల్యాణం

కరీంనగర్ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ఆలయాల్లో ధనుర్మాసోత్సవాల్లో భాగంగాగోదా రంగనాథస్వామి కల్యాణాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరించారు. రాంనగర్ రమా సత్యనారాయణస్వామి ఆలయంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు మల్లికార్జున రాజేందర్-రజనీదేవి, చైర్మన్ చల్ల హరికృష్ణ, ఏ కిరణ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు. 42వ డివిజన్ వావిలాలపల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలో కార్పోరేటర్ మేచినేని వనజ, ఆలయ చైర్మన్ మేచినేని అశోక్‌రావు దంపతులు, భక్తులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ బాలమణి ముఖ్య అతిథిగా హాజరై కల్యాణంలో పాల్గొన్నారు. శ్రీరాంనగర్ కాలనీ శ్రీరామ మందిరంలో అధ్యక్ష కార్యదర్శులు దన్నపనేని మాధవరావు, గజవాడ ఆంజ నేయులు, కార్యవర్గ సభ్యులు, సముద్రాల విజయసారథి, నమిలకొండ నరసింహాచార్యులు, కాండూరి శశికాంత్ పాల్గొన్నారు.

- తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో గల శ్రీ తాపాల లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకుల కల్యాణాన్ని ప్రధాన అర్చకుడు తిరునగరి వెంకటాద్రి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.
- మానకొండూర్: కొండపల్కలలోని సీతారామాలయంలో గోదాదేవి-రంగనాయకుల కల్యాణోత్సవం పురోహితులు రఘురామాచార్యులు జరిపించారు.



రాంనగర్ రమా సత్యనారాయణస్వామి ఆలయంలో గోదా కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చైన్ స్నాచింగ్ కేసులో నిందితురాలి అరెస్ట్

ధర్మపురి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణానికి చెందిన కాకుస్తం సూరమ్మ అనే మహిళను కత్తితో బెదిరించి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారం గొలుసు అపహరించిన కేసులో నిందితురాలు గట్యాల మానసను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ఉదయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న ఇంట్లో ఒంటరిగా ఉన్న సూరమ్మను గట్యాల మానస కత్తితో బెదిరించి బంగారు పుస్తెల తాడును అపహరించినట్లు ఆయన తెలిపారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితురాలు మానసను గుర్తించి పట్టుకొని దొంగిలించిన బంగారు గొలుసు రికవరి చేసినట్లు ఆయన వివరించారు. కేసును 24 గంటల్లో ఛేదించిన ధర్మపురి, మల్యాల సీఐలు రాంనర్సింహారెడ్డి, నీలం రవి, ఎస్‌ఐ ఉదయ్‌కుమార్, ధర్మపురి పోలీస్ సిబ్బందిని ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ రఘుచందర్ అభినందించారు.

కిరాణా దుకాణంలో చోరీ

కొడిమ్యాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్‌లోని కిరాణా దుకాణంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని నిందితులు కిరాణం దుకాణం షట్టర్ కొంత బాగం పైకి లేపి లోపలికి చొరబడ్డారు. కౌంటర్‌లోని మూడు వేల రూపాయలను దొంగిలించారు. దుకాణం యజమాని నంది వెంకటేష్ ఫిర్యాదు మేకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ సందీప్ తెలిపారు.

ఒకరికి తీవ్రగాయాలు

వీణవంక, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన యాసర్ల ఓదెలు అనే వ్యక్తిపై కుక్క దాడి చేయగా తీవ్రంగా గాయపడినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థులు వెంటనే 108 సిబ్బందికి సమాచారం అందించారు. ఈఎంటీ ఐలవేని కుమారస్వామి, పైలెట్ ప్రశాంత్ అక్కడికి చేసుకుని ఓదెలుకు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎత్తిపోతలు..

ఉత్తిపోతలేనా?

నిధులు లేక.. ప్రతిపాదన దశలోనే పథకం

- ప్రభుత్వం నిధులు విడుదల చేస్తేనే సాగు నీరు
- పూర్తయితే వేలాది ఎకరాలకు ప్రయోజనం

మల్యాల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఎత్తిపోతలలో వేలాది ఎకరాల సాగు భూములకు నీరందించాలనే ప్రతిపాదనలు నిధులు లేక ముందుకు వెళ్లడం లేదు. చెరువుల్లో నీరు లేక బావుల్లో భూగర్భ జలాలు అడుగంటడంలో ప్రతి ఏటా సాగు నీరు అందక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మల్యాల మండలం మద్దుట్ల, గొర్రె గుండం, ఓగులాపూర్, నూకపల్లి తదితర గ్రామాలు వరద కాలువకు ఎగువన ఉండడంతో ఆయా గ్రామాల పరిధిలోని సుమారు 1500 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములకు సాగు నీరు అందడం లేదు. వరదకాలువలో నీరు తగ్గినప్పుడల్లా బావుల్లోని నీరు అడుగంటి పోతోంది. మద్దుట్ల గ్రామం పక్క నుంచి దిగువ వైపు నుంచి వరదకాలువ వెలుతుంది. ఆ కాలువకు రైతులు భూములు కూడా కోల్పోయారు. అయినా వీరికి ప్రయోజనం లేకుండా పోయింది. ఈ క్రమంలో మద్దుట్ల శివారులోని వరదకాలువ 76.22కి.మీ వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని రైతులు ప్రతిపాదించారు.


ఎత్తిపోతల పంప్‌హౌజ్ ప్రతిపాదిత ప్రాంతం

● ఎత్తిపోతలకు ప్రతిపాదనలు

మద్దుట్ల శివారులో ఎత్తిపోతల పథకంతో పంప్ హౌస్ ఏర్పాటు చేసి గ్రామ పరిధిలోని కొత్త చెరువు నింపడం ద్వారా సమీపంలోని గుడికుంట్ల చెరువును గ్రావిటీతో నింపడంతో పాటు అక్కడ అదనపు పంప్‌మోటారు ఏర్పాటు చేసి పంపింగ్ ద్వారా గొర్రెగుండంలోని నల్ల మట్టికుంటకు తరలించవచ్చు. ఈ నీటితో మద్దుట్ల కొత్త చెరువు, గుడికుంట, నల్ల మట్టికుంట, నూకపల్లిలోని అలుగుకుంట, రేగులకుంట, రాంపూర్‌లోని పాత, కొత్త చెరువులను కూడా నింపుకునే అవకాశం ఉంటుంది. దీంతో ఈ చెరువుల కిందవేలాది ఎకరాల సాగుభూములకు నీరందనుంది. ఇంతే కాకుండా గొల్లపల్లి, నూకపల్లి, రామన్నపేట, ముత్యంపేట, మల్యాల గ్రామాల పరిధిలో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే మద్దుట్లతో పాటు సమీప ప్రాంతాల్లో సాగు నీరు లేకపోవడంతో ఏటా 70శాతం భూములు బీడుగా ఉంటుండడంతో గత కొన్నేళ్ల క్రితం కొందరు రైతులు వరదకాలువ నుంచి 1.5కి.మీ పైపులైన్ స్వంత ఖర్చులతో ఏర్పాటు చేసుకున్నారు. ఎత్తిపోతల గురించి ప్రజాప్రతినిధులు అధికారుల చుట్టూ తిరిగిన ప్రయోజనం లేకుండా పోతుందని ఈ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వరదకాలువ ఎగువన సాగు చేసిన వరి పంటలు

● లిఫ్ట్‌లో..

కథలాపూర్ మండలం కలికోట సమీపంలో గల సూరమ్మ చెరువు లిఫ్ట్‌లో భాగంగా గత ప్రభుత్వం మద్దుట్ల ఎత్తిపోతలను చేర్చింది. ఇందుకు సుమారు రూ.700కోట్లతో ప్రతిపాదనలు రుపొందించిన అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అందులో మద్దుట్ల లిఫ్ట్‌కు రూ.40కోట్లతో ప్రతిపాదించారు. అయితే బడ్జెట్ ఎక్కువ కావడంతో ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. రెండేళ్ల క్రితం జగిత్యాలకు వచ్చిన సీఎం కేసీఆర్ మద్దుట్ల ఎత్తిపోతల పథకం చేపడుతామని బహిరంగ సభలో ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు.

వెంటనే చేపట్టాలి

- బి.మధుసూధన్‌రావు, మద్దుట్ల



మద్దుట్ల ఎత్తిపోతలను ప్రభుత్వం వెంటనే చేపట్టి రైతులకు సాగు నీరు అందించాలి. వరదకాలువ నుంచి ఎత్తిపోతలతో పాటు పంపింగ్ కూడా పరిశీలించి తగు చర్యలు చేపటితే ప్రత్యక్షంగా వందలాదిగా, పరోక్షంగా వేలాది ఎకరాలకు ప్రయోజనకరంగా మారి ఈ ప్రాంతం సశ్యశ్యామలం కానుంది.

రూ.4లక్షలు ఖర్చు అయ్యాయి

- మ్యాకల మహేశ్, మద్దుట్ల



వరదకాలువకు ఎగువన మద్దుట్ల వ్యవసాయ భూములు ఉండడంతో వందలాది ఎకరాలకు సాగు నీరందక పోగా వరదకాలువలో నీరు లేనప్పుడు సాగు చేసిన కొద్ది పంటలకు నీరందకపోవ డంతో వరదకాలువ నుంచి పైపులైన్ ఏర్పాటు చేసుకున్నాం.

నిధులు మంజూరు కాగానే పనులు

- సంతు ప్రకాశ్, ఈఈ

మద్దుట్ల ఎత్తిపోతలకు సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాము. నిధుల లేమితో ప్రతిపాదనలు తిరిగి పంపించారు. నిధుల లభ్యత, అందుబాటులో ఉన్నప్పుడు ప్రతిపాదనలు పరిశీలించాలని అందులో పేర్కొన్నారు. ఈఎన్‌సీ వద్ద కూడా దీనిపై ప్రతిపాదనలు ఉండడంతో ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు చేపడతాం.

కల్లోల కాలంలో జీవించిన కవి అలిశెట్టి

- ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షుడు అల్లం నారాయణ


పురస్కారం అందుకున్న డాక్టర్ బెల్లి యాదయ్య

కరీంనగర్ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కల్లోల కాలంలో జీవించిన కవి అలిశెట్టి ప్రభాకర్ అని ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షుడు అల్లం నారాయణ అన్నారు. కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో ఆదివారం తెరవే ప్రధాన కార్యదర్శి దామరకుంట శంకరయ్య అధ్యక్షతన నిర్వహించిన అలిశెట్టి ప్రభాకర్ రాష్ట్ర స్థాయి పురస్కారం-2025 సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పురస్కారాన్ని నల్లగొండ జిల్లా కవి డాక్టర్ బెల్లి యాదయ్యకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అలతి అలతి పదాలతో అనంత అర్థాలను సృజించిన గొప్ప కవిత్వం అలిశెట్టిదని అన్నారు. ప్రజల పక్షం వహించి కవిత్వం అలిశెట్టి రాశారని చెప్పారు. అది ఎక్కువ ప్రసంగిత కల సాహిత్యమని అన్నారు. పురస్కార శాశ్వత ప్రదాత, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు మాట్లాడుతూ అలిశెట్టి స్ఫూర్తితో సమ సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని అన్నారు. అలిశెట్టి స్ఫూర్తిని, ఆకాంక్షలను వచ్చే తరాలకు అందించాలని కోరారు. డాక్టర్ బెల్లి యాదయ్య పరిచయాన్ని తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ బూర్ల వెంకటేశ్వర్లు చేశారు. కార్యక్రమంలో విలాసాగరం రవీందర్, మెరుగు ప్రవీణ్, గాజోజు నాగభూషణం, కొండి మల్లారెడ్డి, అన్నవరం దేవేందర్, కందుకూరి అంజయ్య, పీఎస్ రవీంద్ర, మమత వేణు, పెనుగొండ బసవేశ్వర్, సరసిజ, నసీరుద్దీన్, నడిమెట్ల రామయ్య, అన్నాడి గజేంద్రరెడ్డి, డాక్టర్ బీవీఎన్ స్వామి, కొత్త అనిల్‌కుమార్, బాలసాని కొమురయ్య, ఎర్రోజు వేంకటేశ్వర్లు, ఇటిక్యాల రాము, కూకట్ల తిరుపతి, జనగాని యుగంధర్, గుడికందుల అరుణ్‌కుమార్, అఖిల్‌కుమార్, ఒడ్డేపల్లి రాజేశం, జిందం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

లోయలో దూకిన యువకుడు

మల్యాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం వెనుకాల గల బేతాళ గుడి సమీపంలోని బండ రాయిపై నుంచి మల్యాలకు చెందిన మహిపాల్ అనే యువకుడు అనారోగ్యంతో బాధపడుతూ లోయలోకి దూకినట్లు స్థానికులు తెలిపారు. లోయలోకి దూకడాన్ని గమనించిన స్థానిక పోలీస్ అవుట్‌పోస్టు ఏఎస్సై చిలుక శ్రీనివాస్, పోలీసులు, హోంగార్డు మహిపాల్‌ను రక్షించే యత్నాలు చేశారు. ఇందులో ఏఎస్సై చిలుక శ్రీనివాస్ జారి పడి కిందపడి పోయారు. చేతికి గాయాలు అయ్యాయి. యువకుడిని బయటకుతీసి 108లో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కోలుకుంటున్నాడు.

రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు పతకాలు


రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 4, 5, 6 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభచాటి పలు పతకాలు సాధించారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి పాల్గొన్న ఎల్ సత్య 30 సంవత్సరాల విభాగంలో రెండు బంగారు పతకాలు, కే శ్వేత బంగారు, కాంస్య పతకాలను సాధించారని జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పేర్యాల రవీందర్‌రావు, నీలం లక్ష్మణ్ తెలిపారు. 50 సంవత్సరాల విభాగంలో బి రాధ బంగారు, కాంస్య పతకాలను సాధించగా, పురుషుల విభాగంలో 30 సంవత్సరాల విభాగంలో ఎన్ శ్రీధర్ రజత పతకాలను, ఎల్ సుధాకర్‌రావు రజత పతకాన్ని, 40 సంవత్సరాల విభాగంలో పి ప్రసాద్‌గౌడ్ రజత పతకాన్ని, ఎం సంపత్ రజత పతకాన్ని, 45 సంవత్సరాల విభాగంలో ఏ అశోక్ రజత పతకాన్ని, 50 సంవత్సరాల విభాగంలో పి చంద్రశేఖర్ రజత, కాంస్య పతకాలను సాధించారని తెలిపారు. 60 సంవత్సరాల విభాగంలో పివి రామారావు బంగారు పతకాన్ని, 65 సంవత్సరాల విభాగంలో పి కిషన్‌రావు మూడు బంగారు పతకాలను, 80 సంవత్సరాల విభాగంలో ఏ ఐలయ్య రజత పతకాన్ని సాధించాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, యోగా కోచ్ వి కిష్టయ్య, అథ్లెటిక్స్ కోచ్ నీలం పద్మ, రాజిరెడ్డి, వేల్పుల వెంకటేశ్, సుదర్శన్, తదితరులు అభినందించారు.

డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్‌తో గుల్బం శ్రీధర్

కోల్‌సిటీటౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని రామగుండం మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ గుల్బం శ్రీధర్ గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ(అమెరికా) ఇటీవల మద్రాసు రాజా అన్నమలై మంద్రంలో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ అందుకున్నారు. విద్యా వ్యవస్థలో గత 25 ఏళ్ళుగా ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చి దిద్దినందుకు శ్రీధర్‌కు గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. శ్రీధర్ డాక్టరేట్ అందుకోవడంపై పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు అభినందనలు తెలిపారు.

కాలువకు గండి

- ఇళ్లలోకి చేరిన నీరు .. తడిచిపోయిన వస్తువులు
- అధికారులు సమస్య పరిష్కరించాలని ప్రజల వినతి


మన్నెంపల్లిలో కాలువకు పడిన గండి

తిమ్మాపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో డిస్ట్రిబ్యూటరీ 4 ఎడమ కాలువకు ఆదివారం తెల్లవారు జామున భారీ గండి పడింది. దీంతో కాలువ సమీపంలో ఉన్న ఎస్సీ కాలనీతో పాటు పలు కాలనీల్లోకి వరద నీరు చేరింది. ఇంట్లో నిలువ చేసుకున్న వంట సమన్లు, పప్పులు, బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు తడిసి ముద్దయ్యాయని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని చోట్ల వస్తువులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. వారం రోజుల క్రితం యాసంగి పంటలకు రైతులకు మిడ్‌మానేరు రిజర్వాయర్ నుంచి తోటపల్లి రిజర్వాయర్‌కు 300 క్యూసెక్కుల నీటి విడుదల చేశారు. ఇందులో సైదాపూర్‌కు 150 క్యూసెక్కులు, డిస్ట్రిబ్యూటర్ 4 ఎడమ కాలువకు 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ రెండింటికి కలిపి పీచుపల్లి వద్ద రెగ్యులేటర్ ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి సైదాపూర్‌కి వెళ్లే కాలువను పూర్తిగా మూసి వేశారు. దీంతో అటువైపు వెళ్లే వరద నీరు డిస్ట్రిబ్యూటరీ 4 ఎడమ కాలువ వైపునకు మళ్లింది. నీటి ప్రవాహం పెరగడంతో మన్నెంపల్లి గ్రామం వద్ద కాలువకు భారీగా గండి పడింది. గండి పడ్డ ప్రాంతం నుంచి సమీపంలో ఉన్న మన్నెంపల్లిలోని పలు గ్రామాల్లోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చింది. ఒక్కసారిగా నీరు రావడంతో గ్రామస్థులు భయందోళనకు గురయ్యారు. స్థానికులు అధికారులకు సమాచారం అందించడంతో తోటపల్లి రిజర్వాయర్ నుంచి విడుదల అవుతున్న నీటిని తగ్గించారు. పీచుపల్లి వద్ద ఉన్న రెగ్యులేటరీ గేట్లు ఎత్తడంతో నీరు సైదాపూర్ వైపునకు మరలాయి. దీంతో మన్నెంపల్లిలో గండి వద్ద నీటి ఉధృతి తగ్గింది.


వంట గదిలోకి చేరిన నీరు

నాలుగు సార్లు గండి..



కాలువకు గండి పడి ఇళ్లల్లోకి నీళ్ల వచ్చాయి. దీంతో బియ్యం బస్తులు, కారం పోడి, ఉప్పు, పప్పు, మందు బస్తాలు తడిచి పోయా యి. ఇప్పటికైనా అధి కారులు మరమ్మతు చర్యలు తీసుకోవాలి.

- కనకవ్వ, మన్నెంపల్లి

ఇంట్లోని వస్తువులు తడిచిపోయాయి..



కాలువకు గండి పడి ఉదయం ఇంట్లోకి నీళ్ల రావడంతో వస్తువులు తడిచిపోయాయి. మమ్మల్ని పట్టించుకొనే వారే కరువయ్యారు. బి య్యం, ఉప్పు, పప్పులు నీటిలో కొట్టుకు పోయాయి.

- తిరుపతి, మన్నెంపల్లి

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

తిమ్మాపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో కెనాల్ డి-4 కాలువకు ఆదివారం గండి పడిన సంఘటనలో బాధత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు. కాలువకు గండి పడిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హుటాహుటిన మన్నెంపల్లి గ్రామానికి బయలుదేరి వచ్చారు. కాలనీల్లో దారుల్లోను గుండా ప్రవాహిస్తున్న నీటిలో నుంచి ఎమ్మెల్యే నడుచుకుంటు పలు ప్రదేశాలను సందర్శించి పరిశీలించారు. అనంతరం గండి పడ్డ ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. అందుకు గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోరపల్లి రమణ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్.ఎల్.గౌడ్, మాజీ సర్పంచ్ మేడి అంజయ్య, నాయకులు తూముల శ్రీనివాస్, పోతుగంటి శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు. వరద నీరు తగ్గించేందుకు రావుల క్రిష్ణా చేసిన కృషికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అభినందించి సన్మానించారు

- పూడ్చివేత పనులు ప్రారంభం

తిమ్మాపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): డి-4కాలువకు 9కిలోమీటర్ వద్ద ఆదివారం గండి పడి గ్రామంలోకి నీరు వచ్చిన సంఘటనలో సాయంత్రం ఇరిగేషన్ అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించారు. ఈ గండి పడిన ప్రదేశాన్ని ఇరిగేషన్ ఈఎస్సీ శంకర్, ఎన్ఈ సుమతి దేవి, ఈఈ పెద్ది రమేష్, డీఈఈ సదయ్య పరిశీలించారు. తోటపల్లి రిజ ర్వాయర్ నుంచి కాలువకు వస్తున్న నీటిని పూర్తిగా నిలిపివేసినట్లు తెలిపారు.


నీట మునిగిన ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఈత సరదా కారాదు విషాదం..

- యువకులూ... జర భద్రం....
- సెలవుల్లో జాగ్రత్త

కరీంనగర్ క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈత సరదా కొన్ని సందర్భాల్లో విషాదంగా మారుతోంది. పండగ సెలవుల్లో యువకులతోపాటు వారి కుటుంబ సభ్యులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొండ పోచమ్మసాగర్‌లో శనివారం ఐదుగురు యువకులు నీటి మునిగి మృత్యువాత పడిన ఘటన ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ నేపథ్యంలో మన జిల్లాలోని జలాశయాలు, చెరువులు, కుంటల వద్ద భద్రతను అధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. సంక్రాంతి పండగకు అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ఇచ్చారు. విద్యార్థులు, యువకులతోపాటు పెద్దలు కూడా ఈత కొట్టేందుకు సరదాపడి స్థానికంగా ఉన్న జలాశయాలు, చెరువులు, కుంటలలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తారు. ఈత రాకున్నా జలాశయాలు, చెరువుల్లో నీటి చివర కొంతదూరం వరకు వెళ్లి లోతు లేదని ఈత కొట్టేందుకు, స్నానం చేసేందుకు ప్రయత్నిస్తారు. ఆ జలాశయాలలో, చెరువులు, కుంటలలో నీటి అడుగున గుంతలను గమనించక మునిగిపోయి గల్లంతవుతుంటారు. కరీంనగర్ శివారులోని మానేరు జలాశయం ప్రస్తుతం పూర్తి సామర్థ్యంతో నీటితో నిండింది. జిల్లాలోని చెరువులు, కుంటలు నిండుకుండల్లా ఉన్నాయి. సెలవులకు పట్టణాల నుంచి గ్రామాలకు వచ్చిన పిల్లలు ఈత సరదాకు జలాశయాలు, చెరువుల వైపు వెళ్ళకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

● కనీస రక్షణ చర్యలు కరువు

2015 మే 25న కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో ఆరుగురు విద్యార్థులు నీటి గుంతలో మునిగి మృతి చెందారు. రెండు కుటుంబాలలో ఇద్దరేసి కొడుకులు మృత్యువాత పడగా ఇందులో ఒక కుటుంబానికి చెందిన కవలపిల్లలున్నారు. హైదరాబాద్‌లో చదువుతున్న పిల్లలు వేసవి సెలవులకు కరీంనగర్‌కు వచ్చి మృత్యువాత పడిన సంఘటనల అందరిని కలచివేసింది. ఈత, స్నానానికి భారీ సంఖ్యలో ప్రజలు వస్తున్న విషయం తెలిసినా ప్రాజెక్టు అధికారులు ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లో కంచెను సూచికలు ఏర్పాటు చేయక పోవడంతో ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. దిగువ మానేరు జలాశయం వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ఇదివరకు లష్కర్లు, వాచ్‌మెన్, సూపర్‌వైజర్లు 30 మంది వరకు పనిచేసేవారు. ఇప్పుడు వారెవరూ కనపడటంలేదు. లేక్ అవుట్‌పోస్ట్‌లో కానిస్టేబుల్, హోంగార్డులు మాత్రమే ప్రస్తుతం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.



ఆర్‌టీఏ మెంబర్‌గా పడాల రాహుల్

కరీంనగర్ అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రీజనల్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ(ఆర్‌టీఏ) మెంబర్‌గా పడాల రాహుల్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశీర్వాదంతో 2008లో ఎన్‌ఎస్‌యూఐలో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన రాహుల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేశారు. రాహుల్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గొలుసు అపహరణకు యత్నం

మల్యాల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పొలం పనులకు వెళ్లిన మహిళ రైతు మెడలో నుంచి గొలుసు అపహరణకు ఇద్దరు యువకులు ఆదివారం యత్నించారు. మండలంలోని రామన్నపేటకు చెందిన వెల్మ సుగుణమ్మ అనే వృద్ధురాలు పొలం పనుల్లో భాగంగా పంప్‌మోటార్ స్టార్ట్ చేసి వస్తుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో నుంచి గొలుసు అపహరణకు యత్నించారు. ఆమె అరవడంతో ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై నుంచి పరారీ అయ్యాడు. మరో వ్యక్తి పొలంలో నుంచి పరుగెత్తుకొని వెళ్లడంతో సమీపంలో గల రైతులు వెంబడిచ్చి పట్టుకున్నారు. ఆయన ఇచ్చిన సమాచారం మేరకు వాహనంపై నుంచి పరారీ అయిన వ్యక్తిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన ఇద్దరిపై కేసు నమోదు చేసి పోలీసులు విచారిస్తున్నారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూనారం గ్రామశివారులో శనివారం రాత్రి పేకాట ఆడుతుండగా ఎస్సై వెంకటేష్ సిబ్బందితో కలిసి వెళ్లి ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి 41,670 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, మరికొందరు పారి పోయినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో పేకాడుతున్నట్లు గమనిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



చెరకు వేద్దామా.. వద్దా

సాగుపై అన్నదాత సందిగ్ధం

- నిజాం షుగర్స్ పునరుద్ధరణపై ఇంకా రాని స్పష్టత
- ఈ యేడాది డిసెంబరులో ఫ్యాక్టరీ నడవాలంటే చెరకు సాగు కీలకం
- చెరకు సాగుకు ప్రయత్నాలు
- జగిత్యాల జిల్లాలో కేవలం 1,200 ఎకరాల్లోనే చెరకు

జగిత్యాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నిజాం షుగర్స్ కర్మాగారాల పునరుద్ధరణలో అత్యంత కీలక అంశమైన చెరకు సాగులో రైతులు సందిగ్ధంలో ఉన్నారు. లే ఆఫ్‌తో మూసివేసిన జగిత్యాల జిల్లా ముత్యంపేట, నిజామాబాద్ జిల్లా బోధన్, మెదక్ జిల్లా ముంబోజుపల్లి కర్మాగారాలను ఈ యేడాది డిసెంబరులో పునరుద్ధరిస్తామని ప్రభుత్వ పెద్దలు పలు సందర్భాల్లో ప్రకటించారు. ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో యేడాది క్రితం సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులను కర్మాగారాలను సందర్శించి రైతుల అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. సంబంధిత నివేదిక ఆధారంగా ప్రైవేటు యాజమాన్యం పరిధిలో గల ఈ ఫ్యాక్టరీలకు చెందిన సుమారు రూ. 400 కోట్ల బ్యాంకు అప్పులను రాష్ట్ర ప్రభుత్వం వన్‌టైం సెటిల్‌మెంట్ కింద విడతల వారీగా రూ. 190 కోట్లు చెల్లించి రుణవిముక్తి కల్పించింది. ఫ్యాక్టరీల పునః ప్రారంభం విషయంలో ప్రభుత్వం మరింత వేగంగా ముందుకు వెళ్తుందని రానున్న క్రషింగ్ సీజన్ డిసెంబరు నాటికి తెరిపిస్తామని ప్రభుత్వ పెద్దలు అంటున్నారు. ఫ్యాక్టరీ నడవాలంటే ప్రధాన ముడిసరుకు అయిన చెరకు కీలకంగా ఉంటుంది. ఇప్పటి నుంచే సాగు ప్రారంభిస్తే క్రషిం గ్ సీజన్ ప్రారంభం నాటికి చేతికి వచ్చే వీలుంటుంది. ఆ దిశగా జిల్లాలో ప్రయత్నాలు జరగడం లేదు.

పూర్వ వైభవంపై ఆశలు..



నిజాం షుగర్స్ యూనిట్లను 2002 సంవత్సరంలో డెల్టా పేపర్ మిల్స్ అనే ప్రైవేటు కంపెనీకి అప్పటి ప్రభుత్వం విక్రయించింది. 2014 ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ నిజాం షుగర్స్‌ను ప్రభుత్వ పరం చేస్తామని ప్రకటించారు. 2015 డిసెంబరు 23వ తేదీన బోధన్, ముత్యంపేట, ముంబోజుపల్లి యూనిట్లలో లే ఆఫ్ ప్రకటించి మూసివేశారు. దీంతో చెరకు రైతులు ఇతర పంటల వైపు మళ్లారు. నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా హామీనిచ్చింది. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తూ రానున్న క్రషింగ్ సీజన్ డిసెంబరు నాటికి తెరిపిస్తామని అంటోంది. ఫ్యాక్టరీ ప్రారంభిస్తే ఈ ప్రాంతంలో ఆర్థిక ఆదాయం పెరుగుతుందని పలువురు అంటున్నారు. రైతుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసి చెరకు సాగు ప్రోత్సహించడంతో పాటు ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అన్నదాతల్లో పలు సందేహాలు..

దాదాపుగా తొమ్మిదేళ్లుగా మూతపడిన ఫ్యాక్టరీలు నడవాలంటే మిషనరీల మరమ్మతు, కొత్త మిషనరీలను ఏర్పాటు చేయడం జరగాలని, ఇప్పటివరకు వీటికి ప్రభుత్వం ఒక్క రూపాయి విడుదల చేయలేదని, ఇలాంటి పరిస్థితుల్లో ఎలా నమ్ముతామని రైతులు అంటున్నారు. ఫాక్టరీని ప్రైవేటురంగంలో నడిపిస్తారా...? ప్రభుత్వం నడిపి స్తుందా.. లేకుంటే సహకా ర విధానంలో నడిపి స్తారా అనే విషయం ఇంకా తేలలేదని రైతులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. గతం లో ముత్యంపేట కర్మాగారంలో సీజన్‌కు 2.50 లక్షల టన్నుల మేరకు చెరకు గానుగాడించే వారు. సుమారు 10 నుంచి 15 వేల ఎకరాల్లో పంట సాగు చేసేవారు. ప్రస్తుతం జిల్లాలో కేవలం సు మారు 1,200 నుంచి 1,500 ఎకరా ల్లోపు మాత్రమే చెరకు సాగు చేస్తున్నారు. రైతులు వరి సాగు వైపు మళ్లారు. ఫాక్టరీ తెరిస్తే చెరకు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

రైతుల్లో అవగాహన కల్పించాలి

- అల్లూరి మహేందర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్, జగిత్యాల జిల్లా



చెరకు సాగు అవసరాలపై రైతుల్లో అవగాహన కల్పించాలి. దీర్ఘకాలిక పంట అయిన చెరకు రానున్న క్రషింగ్ సీజన్ వరకు చేతికి రావాలంటే ఇప్పటి నుంచే సాగు ప్రారంభించాలి. రైతుల సందేహాలను అధికారులు నివృత్తి చేసి సాగుకు ప్రోత్సహించాలి. ప్రభుత్వ సంకల్పం మేరకు ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం అటు రైతులు, ఇటు అధికారులు పరస్పర సహకారాలు అందించుకోవాలి.

పూర్వ వైభవం తీసుకురావాలి

- కొత్తపల్లి రాజిరెడ్డి, చెరకు రైతు, ఫ్యాక్టరీ చిట్టాపూర్ గ్రామం, జగిత్యాల జిల్లా



పూర్వ వైభవం రావడానికి చెరకు సాగును ప్రోత్సహించి ఫ్యాక్టరీ తరఫున రైతులతో ఒప్పందాలు జరగాలి. సబ్సిడీలు అందించాలి. మేలు రకమైన విత్తనాలు సరాఫరా చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు పెంచాలి. మద్దతు ధరను ముందుగానే ప్రకటించాలి.

భారత ఖోఖో జట్టు అసిస్టెంట్ కోచ్‌గా నరేష్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన జాతీయ ఖో-ఖో క్రీడాకారుడు, దక్షిణ మధ్య రైల్వే కోచ్ ఇస్లావత్ నరేష్ భారత మహిళల ఖో-ఖో జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా ఎంపికయ్యాడు. ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగే మొదటి ఖో-ఖో ప్రపంచకప్ పోటీల్లో పాల్గొనే భారత మహిళల జట్టుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ధర్మారం మండలం బంజరుపల్లి తండాకు చెందిన ఇస్లావత్ నరేష్ అసిస్టెంట్ కోచ్‌గా విధులు నిర్వర్తించనున్నాడు. ఈ ప్రపంచ కప్‌లో ఖో-ఖో పోటీల్లో 26 దేశాల నుంచి 50 ఖో-ఖో జట్లు పాల్గొననున్నాయి. గత నెల రోజులుగా ఢిల్లీలో జరుగుతున్న భారత జట్ల శిక్షణ శిబిరాలలో భారత మహిళల జట్టుకు శిక్షణను అందించాడు. భారత మహిళల జట్టుకు ఢిల్లీకి చెందిన సుమిత్ భాటియా చీఫ్ కోచ్‌గా ఉండగా, నరేష్ అసిస్టెంట్ కోచ్‌గా విధులను నిర్వర్తించ నున్నాడు. నరేష్‌ను తెలంగాణ రాష్ట్ర ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జంగా రాఘవరెడ్డి, నాతి కృష్ణమూర్తి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖో-ఖో సంఘ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు, రాష్ట్ర ఖో-ఖో సంఘ రిఫరీస్ బోర్డు చైర్మన్ కేద సదానందం, కన్వీనర్ వంగపల్లి సూర్యప్రకాశ్, పెద్దపల్లి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శు లు లక్ష్మణ్, డాక్టర్ వేల్పుల కుమార్, డా క్టర్ వేల్పుల సురేందర్, సీఐ కుమార స్వామి, , ఎస్‌ఐ రమేశ్, సీనియర్ ఖో-ఖో క్రీడాకారులు జలంధర్, గెల్లు మధుకర్, ఆనంద్ రాజు, రవీందర్, నవీన్‌కుమార్, కట్ట సంతోష్, తిరుపతి రెడ్డి తదితరులు అభినందించారు.



రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో భక్తుల తాకిడి పెరుగుతోంది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు.

'పరిపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం'

పెద్దపల్లి కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో విఫలమైందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ మేథోమదన సదస్సులో వ్యాపార నిపుణులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తెలంగాణను శిథిలం చేసిందని ఆయన విమర్శించారు. ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దాసరి ఉష, పలువురు ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, వ్యాపారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- పథకాల అమలుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యాచరణ ప్రణాళిక సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కరీంనగర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): రాజకీయాలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా కార్యాచరణ ప్రణాళిక సమీక్షా సమా వేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకం రాష్ట్రంలో అమలు చేస్తామన్నారు. పథకాల అమ లుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయానికి యోగ్యమైన భూమికి పంట వేసినా, వేయకపోయినా రైతు భరోసా కింద సంవత్సరానికి 12 వేల రూపాయలు అందిస్తామన్నారు. రోడ్లు, రియల్ ఎస్టేట్ స్థలాలు సాగుకు యోగ్యం కాని భుములకు రైతు భరోసా ఇవ్వబోమని స్పష్టం చేశారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయలు అందిస్తామని తెలిపారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తామన్నారు. ఈ నెల 26 నుంచి రేషన్ కార్డుల పంపిణీ మొదలవుతుందన్నారు. తెలంగాణలో గత ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు 90 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఉండేవని, అధికారంలోకి వచ్చాక 49 వేల కొత్త కార్డులు మాత్రమే ఇచ్చారని తెలిపారు. వచ్చే నెల నుంచి ఆరు కిలోల సన్న బియ్యాన్ని అందిస్తామన్నారు. కాళేశ్వరం నుంచి నీరు ఎత్తిపోయకుండానే రాష్ట్ర వ్యాప్తంగా 66.7 లక్షల ఎకరాల్లో 155 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందన్నారు. జిల్లాలో అర్హత ఉన్న ప్రతి వ్యక్తికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని రోళ్లవాగు, పత్తిపాక, పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్లు మంజూరు చేయబోతున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మధ్యలో వదిలేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సమన్వయంతో సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచిం చారు. అర్హత ఉన్న ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు, యోగ్యతగల ప్రతి రైతుకు రైతు భరోసా అందజేయాలన్నారు. లబ్ధిదారుల గుర్తింపులో అప్రమ త్తంగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో ఏవైనా ఆటంకాలు కలిగించినా, అధికారులపై దాడులు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో రూ. 12 వేలు..

- మంత్రి పొన్నం ప్రభాకర్



వ్యవసాయదారులకు రైతు భరోసా తో పాటు వ్యవసాయ కూలీ లకు కూడా ఇంది రమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా 12 వేలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం తమ దేనని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పేదల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని, ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డు అంద జేస్తామని తెలిపారు. పక్షపాతం లేకుండా ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేస్తా మని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయరమ ణారావు, మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, సంజయ్‌కుమార్, గంగుల కలామకర్, పాడి కౌశిక్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆదిశ్రీనివాస్, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, ఎల్ రమణ, భాను ప్రసాదరావు, మేయర్ సునీల్‌రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, కలెక్టర్లు సందీప్‌కుమార్ ఝా, కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, అరుణశ్రీ, అఖిల్ మహాజన్, లక్ష్మీకిరణ్, అబ్దుల్ అజీజ్, భీమ్యానాయక్, వేణు, బీఎస్ లత పాల్గొన్నారు.



కౌశిక్‌రెడ్డి తీరును తీవ్రంగా ఖండిస్తున్నా..

● మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

కరీంనగర్ అర్బన్: ఉమ్మడి జిల్లా అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికా సమావేశంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తీరును రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఏడు సార్లు ఎమ్మెల్యే, ఎంపీగా గెలిచిన సీనియర్ మోస్ట్ నాయకుడిగా తాను ఎన్నడూ ఇటువంటి ప్రవర్తన ఎక్కడా చూడలేదని అన్నారు. అధికారిక సమావేశానికి, రాజకీయాలకు సంబంధం లేదన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులందరినీ సమావేశానికి ఆహ్వానించామన్నారు. ఈ సందర్భంగా అందరిని మాట్లాడాలని కోరామని, కానీ ఒక ఎమ్మెల్యేను అడ్డుకుని రాజకీయ ప్రసంగం చేసి అనుచితంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.

● గుండాయిజం, రౌడీయిజం చేస్తే ఊరుకోం...

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ఉమ్మడి జిల్లా అభివృద్ధి సంక్షేమ పథకాలపై కార్యాచరణ రూపొందించేందుకు నిర్వహించిన సమావేశంలో అనుచితంగా ప్రవర్తించడం శోచనీయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అనుచిత ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పేదలు, దళితుల అభివృద్ధికి ప్రభుత్వం ఏ విధంగా కార్యాచరణ రూపొందిస్తుందనేది చూశాక స్పందించాలని, కానీ అందుకు విరుద్ధంగా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తన ఉందన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నవారికి ఎన్నడూ అవకాశం ఇవ్వలేదని, ఆదివారం జరిగిన సమావేశంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా మాట్లాడేందుకు అవకాశం కల్పించామన్నారు. దీన్ని అవకాశంగా తీసుకొని ఎమ్మెల్యే అనుచితంగా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. పేదవారికి మేలు జరుగుతున్నప్పుడు ప్రభుత్వానికి అండగా నిలబడాలనే ఉద్దేశంతో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సహకరించేందుకు ముందుకు వచ్చారన్నారు. పోలీసులు కౌశిక్‌రెడ్డిని అదుపు చేసేందుకు యత్నించగా వారిపై కూడా ఎదురుతిరిగేలా వ్యవహరించాడని, గుండాయిజం, రౌడీయిజం చేస్తే ఊరుకోబోమని మంత్రి శ్రీధర్‌బాబు హెచ్చరించారు.

● బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకత్వం స్పందించాలి...

- మంత్రి పొన్నం ప్రభాకర్

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అనుచిత ప్రవర్తనపై బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకత్వం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు స్పందించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు సమర్థిస్తున్నారా? ప్రోత్సహిస్తున్నారా? ఆదర్శంగా తీసుకుని బూతు మాటలు నేర్పే స్కూల్ ఏమైనా పెట్టుకున్నారా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి ఘటన మంచి పద్ధతి కాదని, తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గతంలోనూ వ్యక్తిగతంగా బెదిరింపులకు పాల్పడ్డారని, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంను కూడా బెదిరించారన్నారు.

సంజయ్‌కుమార్ X కౌశిక్‌రెడ్డి

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మధ్య జరిగిన వాగ్వాదం, తోపులాట కారణంగా సమీక్షా సమావేశం రసాభాసగా మారింది. సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడడానికి మైకు తీసుకోగా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అభ్యంతరం చెప్పారు. ఆయన ఏ పార్టీకి చెందిన వ్యక్తి, ఎందుకు మాట్లాడడానికి అవకాశం ఇస్తున్నారంటూ ప్రశ్నించి ఆయనపైకి దూసుకువెళ్లే ప్రయత్నం చేశారు. దానికి డాక్టర్ సంజయ్‌కుమార్ దీటుగా స్పందించారు.



ఎమ్మెల్యేలు సంజయ్, కౌశిక్‌రెడ్డి మధ్య వాగ్వాదం

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆయనకు అండగా నిలిచి నువ్వు ఏ పార్టీ నుంచి వచ్చావు అంటూ కౌశిక్‌రెడ్డిని ప్రశ్నించారు. ఈ సందర్భంలోనే మాటా మాట పెరిగి ఒకరిని ఒకరు తోసివేసుకుంటూ వ్యక్తిగత దూషణలకు దిగారు. ఈ లోగా పోలీసులు జోక్యం చేసుకుని కౌశిక్‌రెడ్డిని బయటకు తీసుకువెళ్లారు. గేటు బయటనే నిలబడిన కౌశిక్‌రెడ్డి సిగ్గు..లజ్జా ఉంటే రాజీనామా చేసి మళ్లీ గెలవమని సంజయ్‌కుమార్‌కు సవాల్ విసిరారు. సమావేశంలో కౌశిక్‌రెడ్డి వ్యవహరించిన తీరుపై మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తీవ్ర అసహనం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వ్యవహారం సరిగా లేదని మార్చుకోవాలని హెచ్చరించారు. తనను విమర్శించడానికి, రాజీనామా చేయమని అడగడానికి కౌశిక్‌రెడ్డికి ఎలాంటి అధికారం లేదని డాక్టర్ సంజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌశిక్‌రెడ్డిమీద స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

● సంజయ్‌కుమార్ కాంగ్రెస్ బీఫాంపై పోటీ చేసి గెలిచి చూపించాలి

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు దమ్ముంటే కాంగ్రెస్ బీఫాంపై పోటీ చేసి గెలిచి చూపించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండు సీజన్లలో రైతు భరోసా ఇవ్వలేదని, ఈ విషయంపై ఉమ్మడి జిల్లా రైతుల పక్షాన, తెలంగాణ రైతుల పక్షాన తాము అడుగుతున్నామని అన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో వంద శాతం రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 18,500 కుటుంబాలకు దళితబంధు ఇచ్చామని, రెండో విడత దళితబంధును ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. కచ్చితంగా దళితబంధు విడుదల చేయాలని తాను చెప్పానని, ఇవన్నీ అడిగితే ముగ్గురు మంత్రులు, ఎమ్మెల్యేలు మందబలం ఉందని బెదిరించే ప్రయత్నం చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. అధికారులు ఇష్టం వచ్చినట్లు చేస్తున్నారని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరినీ వదిలి పెట్టబోమని హెచ్చరించారు.

కాంగ్రెస్‌లోనే ఉన్నా.. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా కొనసాగుతా..

● జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

కరీంనగర్ అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లోనే ఉన్నానని, ఆ పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. కరీంనగర్‌లో ఆదివారం జరిగిన ఉమ్మడి జిల్లా సమావేశంలో జరిగిన ఘటనపై ఆయన ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రవర్తన పలుమార్లు చూశామని, తోటి ఎమ్మెల్యేలపై అన్ పార్లమెంటరీ వ్యాఖ్యలు మాట్లాడుతున్నాడని అన్నారు. కరీంనగర్‌లో ఆదివారం జరిగిన అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న తనను ఏ పార్టీ అని కౌశిక్‌రెడ్డి అడిగాడన్నాడు. తప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని, జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి కలిసి పనిచేస్తానని సంజయ్‌కుమార్ అన్నారు. తనపై కౌశిక్‌రెడ్డి అరవడానికి వచ్చినప్పుడు మిగతా కాంగ్రెస్ శాసనసభ్యులు, మంత్రులు అందరూ నాకు అండగా వచ్చారని పేర్కొన్నారు.



బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు కూడా అతన్ని పద్ధతి కాదని పక్కకు తీసుకువెళ్లారని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ గతంలో సీపీఐ, బీఎస్పీ, టీడీపీ, కాంగ్రెస్‌లకు చెందిన నాయకులను కలుపుకుందని, ఫిరాయింపుల గురించి మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదన్నారు. మాది మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ కుటుంబమేనని సంజయ్‌కుమార్ అన్నారు. తనకు అవకాశాలు రాక కాంగ్రెస్ పార్టీలోకి రాలేదని, సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులతో కలిసి జగిత్యాలను అభివృద్ధి చేసుకుంటానని ఆయన తెలిపారు. రోడ్ల వెంట వెళ్తుంటే కుక్క మొరిగినట్లు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఏదో అరిచాడని, దానికి అంత ప్రాధాన్యం ఇవ్వనని సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు.

కరాటే పోటీల పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ స్పోర్ట్స్ జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కుంపు కరాటే పోటీల పోస్టర్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలోని ఫిట్‌నెస్ లైవ్ జిమ్‌లో ఆల్ స్టైల్స్ కుంపు యూనిట్ ఆఫ్ తెలంగాణ అకాడమీ మాస్టర్ ఓడ్నాల శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కుంపు, కరాటే పోటీలను ఫిబ్రవరి 16న రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేంపేట సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈపోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వెయ్యి మంది క్రీడాకారులు హజరు కానున్నారని తెలిపారు. ఈ పోటీలకు బలగం సినిమా డైరెక్టర్ ఎల్దండి వేణు ముఖ్య అతిదిగా హజరై విజేతలకు బహుమతులను అందజేస్తారని అన్నారు. ఈకార్యక్రమంలో కుంపు అధ్యక్షులు పంద్రాల లింగమూర్తి, రాజమల్లు, శ్రీధర్, కోశాధికారి శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

కోనో కార్పస్ చెట్లను తొలగించాలి

సుభాష్‌నగర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కోనో కార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, అమ్మ చాకిటబుల్ ట్రస్టు చైర్మన్ దయాల ఓంప్రసాద్ డిమాండ్ చేశారు. కోనో కార్పస్ చెట్ల వల్ల ప్రజలకు శ్వాసకోశ సమస్యలు, ఆస్తమా సమస్యలు ఎదురవుతాయని అన్నారు. పర్యావరణానికి ముప్పు కలిగిస్తుందని, ఈ చెట్లపై పక్షులు కూడా వాలవని తెలిపారు. ఈ మొక్కలు నాటిని చాల తక్కువ సమయంలోనే ఏపుగా పెరుగుతాయని అందుకే వాటిని నాటుతుంటారని తెలిపారు. ఈ చెట్ల వేర్లు 80 మీటర్ల లోతుకు వెళ్లి నీటిని లాగుతుందని, తద్వారా భూగర్భ జలాలు అడుగంటి పోతాయన్నారు.

క్రికెట్‌లో 'వివేకానంద' జట్టు ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్ జనవరి 12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన అంతర డిగ్రీ, పీజీ కళాశాలల క్రికెట్ పోటీల విజేతగా జిల్లా కేంద్రానికి చెందిన వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల జట్టు నిలిచింది. ఇటీవల శాతవాహన యూనివర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో యూనివర్సిటీ పరిధిలోని 30 క్రికెట్ జట్లు పాల్గొని ప్రతిభ చాటాయి. ఫైనల్ పోటీల్లో కరీంనగర్ వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల జట్టు, జగిత్యాల రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో వివేకానంద జట్టు రామకృష్ణ జట్టుపై గెలుపొంది శాతవాహన యూనివర్సిటీ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా జట్టు క్రీడాకారులను కళాశాల కరస్పాండెంట్ ఆగంరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, ఏవో బండి శ్రావణ్ కుమార్, ఏసీవో సంపత్ కుమార్ అభినందించారు.

సామాజిక సేవకుడికి సత్కారం

సుభాష్‌నగర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): వివేకానంద జయంతి సందర్భంగా జగిత్యాలకు చెందిన అభినయ కళానికేతన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌కు చెందిన కవి, రచయిత, సామాజిక సేవకుడు పసుల రవికుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, అభినయ కళానికేతన్ వ్యవ స్థాపక అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

యువతకు స్వామి వివేకానంద ఆదర్శం

-మేయర్ యాదగిరి సునీల్‌రావు -జిల్లా వ్యాప్తంగా స్వామి వివేకానంద జయంతి




కరీంనగర్‌లో వివేకానందుడి విగ్రహానికి పూల మాల వేస్తున్న మేయర్ సునీల్‌రావు, ఐఎంఏ ఆధ్వర్యంలో రక్తదానం

గణేశ్‌నగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యువతకు స్వామి వివేకానంద ఆదర్శమని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. కరీంనగర్‌లో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని శివ థియేటర్ చౌరస్తాలో స్థానిక కార్పొరేటర్ రాపర్తి విజయతో కలిసి వివేకానంద విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం యువజన సేవా పురస్కాలను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్య క్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్ కచ్చు రవీందర్, రాపర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

●వివేకానంద డిగ్రీ,పీజీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ వివేకానందుడి చిత్రపటానికి నివాళులు అర్పించారు.

●ఏబీవీపీ ఆధ్వర్యంలో శివ థియేటర్ చౌరస్తాలో వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ నగర కార్యదర్శి భామండ్ల నందు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అన్నడి శ్రీవర్థన్ రెడ్డి, గోస్కుల విఘ్నేష్, జోనల్ ఇంచార్జులు దేవునూరి విష్ణు, యోగేష్, నగర సంయుక్త కార్యద్శిలు ఆకాశ్, ప్రశాంత్, అనూష పాల్గొన్నారు.

●జ్యోతినగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వివేకానంద విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్, జిల్లా బీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ నివాళులు అర్పించారు.

●**కరీంనగర్ లీగల్:** కరీంనగర్ బార్ అసోసియేషన్ హాల్‌లో స్వామి వివేకానందుడి విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్‌రెడ్డి, బార్ కార్యదర్శి భీమాసాహెబ్, సభ్యుడు దేవ కిషన్, సీనియర్ న్యాయ వాదులు రఘునందన్‌రావు, కోమల ఆంజనేయులు, కొరివి వేణుగోపాల్, ప్రసాద్ పాల్గొన్నారు.

●**సుభాష్‌నగర్:** స్థానిక ఐఎంఏ హాలులో స్వామి వివేకానంద విద్యా పరిషత్తు ట్రస్టు, కరీంనగర్ ఐఎంఏ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ శ్రీకాంత్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ తుడి కళ్యాణ్, చీఫ్ అడ్వైజర్ యెల్లంకి అనిల్‌కుమార్, డైరెక్టర్ ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పొలాస రాంకిరణ్, కరీంనర్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్, కార్యదర్శి డాక్టర్ నవీన్, కోశాధికారి డాక్టర్ విజయ్, శ్రీరామోజు సంగీత, హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్ పాల్గొన్నారు.

●**కరీంనగర్ రూరల్:** బొమ్మకల్ గ్రామంలో పెద్ది లక్ష్మణ్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. విద్యార్థులకు వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాలను, స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు మెంబర్ మండల ప్రధాన కార్యదర్శి పాశం తిరుపతి పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్ మండలంలోని చామన్‌పల్లి గ్రామంలో వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివేకానందుడి విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ మాజీ ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, వివేకానంద యూత్ సభ్యులు పాల్గొన్నారు.

●**హుజూరాబాద్:** పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఏబీవీపీ నాయకులు స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●**వీణవంక:** మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు బత్తిని నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మండలంలోని మల్లారెడ్డిపల్లి అమ్మ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాస్ వివేకానంద చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోనెల సమ్మన్న ముదిరాజ్, సభ్యులు పాల్గొన్నారు.

●**సైదాపూర్:** సోమారం గ్రామ శివారులోగల మోడల్‌స్కూల్‌లో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

●**మానకొండూర్:** మండల కేంద్రంలోని పల్లెమీద బస్టాండ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరాచారి, మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి పాల్గొన్నారు.

●**గన్నేరువరం:** మండల కేంద్రంలో వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నిఖేష్, స్థానిక వివేకానంద యూత్ అధ్యక్షుడు సురేష్, డీసీసీ కార్యదర్శి బొడ్డు సునీల్ పాల్గొన్నారు.

●**రామడుగు:** రంగసాయిపల్లె గ్రామంలో ధర్మజాగరణ సమన్వయ విభాగం నాయకులు స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుర్రం దేవిక, బండరి శేఖర్, మండల శేఖర్ పాల్గొన్నారు.

●**చొప్పదండి:** చొప్పదండిలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు, వివేకానంద యూత్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఆర్‌సీపీ జట్టు



ఆర్‌సీపీ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని సెయింట్ అల్ఫోన్స్ పాఠశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న మెడికల్ క్రికెట్ టోర్నీ విజేతగా ఆర్‌సీపీ జట్టు నిలిచింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ హరికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కరీంనగర్ మెడికల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. టోర్నీ రన్నరప్‌గా ఆదర్శ జట్టు నిలిచింది. ఈ పోటీలకు జిల్లావ్యాప్తంగా 38 జట్లు పోటీపడ్డాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నరేశ్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ హరికృష్ణారెడ్డి, డాక్టర్ సీహెచ్ రమణాచారిలు హాజరై విన్నర్, రన్నర్‌లకు ట్రోఫీలతో పాటు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో మెగా క్రికెట్ టోర్నీని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రాంకిరణ్ పొలాస, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యజ్ఞవరాహక్షేత్రంలో తిరుప్పావై సదస్సు



ప్రబంధ సుధ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పండితులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని యజ్ఞవరాహ క్షేత్రంలో సర్వవైదిక సంస్థానం ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం గోదా మధుర రాసిక్యమ్ పేరుతో తిరుప్పావై సదస్సును ఘనంగా నిర్వహించారు. ట్రస్టు ఉప కులపతి శ్రీభాష్యం వరప్రసాదశర్మ మాట్లాడుతూ సంస్థానం ట్రస్టు ద్వారా అనేక ధార్మిక, ఆధ్యాత్మిక, వైదిక కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. ముఖ్య అతిథిగా తిరుప్పావై, శ్రీవచన భూషణం ప్రవచనం చేస్తున్న సాతులూరి గోపాల కృష్ణమాచార్య స్వామి, విశిష్ట అతిథిగా భద్రాద్రి దేవస్థానం స్థానాచార్యులు కెఇ స్థలశాయి పాల్గొని తిరుప్పావై గ్రంధ విశిష్టతను, గోదాదేవి గొప్పదనాన్ని వివరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన డాక్టర్ ముడుంబై నరసింహరంగాచార్యులు, కండ్లకుంట్ల శ్రీనివాసా చార్యులు, మరింగంటి అనంతాచార్యులు, సముద్రాల శఠగోపా చార్యులు పత్ర సమర్పణలు చేశారు. డాక్టర్ భాగవతుల లక్ష్మణాచార్యులు రాసిన ప్రబంధ సుధ పుస్తకాన్ని గోపాల కృష్ణమాచార్య స్వామి ఆవిష్కరించగా సముద్రాల వేణుగోపాలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు

కరీంనగర్ రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈనెల 26న రైతు భరోసా అందించనున్నట్లు ప్రకటించడంతో అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు గ్రామాల్లో సర్వే చేయనున్నారు. మండల వ్యాప్తంగా ఒకే రోజు 21న గ్రామసభలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి బి సత్యం తెలిపారు. ఈనెల 16న చామనపల్లి, మొగ్దుంపూర్, నగునూర్, 17న ఎలబోతారం, ఇరుకుల్ల, ఆరెపల్లి, 18న వల్లంపహాడ్, చర్లబూత్కూర్, ఫకీర్‌పేట, 19న జూబ్లీనగర్, తహెర్ కొండాపూర్, దుర్శేడ్, 20న చేగుర్తి గ్రామాల్లో సర్వే చేపట్టి, 21వ తేదిన గ్రామ సభలు నిర్వహించనున్నారు. 22, 23 తేదీల్లో లబ్ధిదారుల డేటాను అప్‌లోడ్ చేసి 24, 25వ తేదీన ప్రభుత్వానికి మంజూరుకు పంపిస్తారు. రైతు భరోసా లబ్ధిదారుల ఎంపిక కోసం మండల అధికారులు, గ్రామాల్లో ఏఈవోలు టి సుచరిత, జాఫరుల్ల, ఎన్ స్వర్ణలత, పైడితల్లితో పాటు రెవెన్యూ అధికారులను సంయుక్తంగా సర్వే చేస్తారు.

కరీంనగర్ డెయిరీలో సంక్రాంతి వేడుకలు



డీఎఫ్‌వో బాలమణికి జ్ఞాపికను అందజేస్తున్న డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు

కరీంనగర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కరీంనగర్ డెయిరీలో సంక్రాంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ డెయిరీ చైర్మన్ సిహెచ్ రాజేశ్వర్‌రావు అధ్యక్షత వహించగా ఫారెస్ట్ ఆఫీసర్ బాలమణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డెయిరీ చైర్మన్ సిహెచ్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ పాడి రైతులకు వివిధ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. అనంతరం ఫారెస్ట్ అధికారి బాలమణి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని అద్దం పట్టే విధంగా సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించడం సంతోష దాయకమన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ డెయిరీ పరిధిలో బెస్ట్ ఉమెన్ అవార్డు గ్రహీత పూదరి గంగవ్వను ఘనంగా సత్కరించారు. ముగ్గుల పోటీల్లో 587 మంది విద్యార్థినులు పాల్గొనగా విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పి శంకర్‌రెడ్డి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు, డెయిరీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాలిపెల్లి కుమార్‌కు పురస్కారం

గణేశ్‌నగర్, జనవరి12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని బొమ్మకల్‌కు చెందిన గాలిపెల్లి కుమార్‌కు సేవా పురస్కారం దక్కింది. రక్తదానంతో పాటు 12 సంవత్సరాలుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను కుమార్‌కు వివేకానంద యువజన సమితి వారు కరీంనగర్ మేయర్ సునీల్‌రావు, చల్ల హరిశంకర్, చేతుల మీదుగా విశిష్ట సేవ అవార్డు 2024ను అందజేశారు. ఈసందర్భంగా పురస్కారం అందుకున్న కుమార్‌ను పలువురు అభినందించారు.

నేడు ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 6-30 గంటలకు ఇటీవల మరణించిన యువ కవి, గాయకుడు రావుల పవన్ స్మృతిలో సెయింట్ జార్జ్ స్కూల్ చైర్మన్ డాక్టర్ ఫాతిమారెడ్డి ఆతిథ్యంలో చొప్పదండి రోడ్‌లో తీగలగుట్టపల్లి బస్‌స్టాప్ సమీపంలోని సెయింట్‌జార్జ్ నిసోస్ బ్లాక్‌లో 141వ ఎన్నీల ముచ్చట్లను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, రచయితలు రావుల పవన్ స్మృతి కవిత్వంతో హాజరు కావాలని కోరారు.

అలరించిన ముగ్గుల పోటీలు

సుభాష్‌నగర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయం ప్రాంగణంలో ఆదివారం వాసవి శాతవాహన క్లబ్ అధ్యక్షుడు ఎలగందుల మునీందర్ ఆధ్వర్యలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను హరిహర జువెల్లర్స్ అధినేత చిట్టుమల్ల శ్రీనివాస్, వర్ష జువెల్లర్స్ అధినేత వీరేషం అందించారు.

● కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో అచీవర్స్, అలయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, కోల అన్నారెడ్డి, గాలిపెల్లి నాగేశ్వర్, క్లబ్ జిల్లా గవర్నర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, పాఠశాల డైరెక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సిహెచ్ పల్లవి పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



:క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, జనవరి 12(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ హుజూరాబాద్ నియోజకవర్గం క్రీడలకు పుట్టినిల్లన్నారు.సంక్రాంతి సెలవులను, విద్యార్థులు, యువత వృథా చేయకుండా క్రీడ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి, వీణవంక టౌన్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

రామడుగు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే వేల గొంతులు, లక్ష డప్పుల సన్నాహక సదస్సుకు మాదిగలు తరలిరావాలని కోరుతూ చేపట్టిన రథయాత్ర ఆదివారం మండలానికి చేరుకున్నది. కార్యక్రమంలో కళామండలి రథయాత్ర రాష్ట్ర కోఆర్డినేటర్ రామంచ భరత్, నాయకులు బెజ్జంకి అనిల్, కొత్తూరి రాజన్న, తడగొం డ శంకర్, దొమకొండ శ్రీనివాస్, హనుమయ్య, గంగాధర రవి, నరేష్, గుంటుకు వినయ్, కొలేపాక మల్లేశం, శనిగరపు మల్లయ్య పాల్గొన్నారు.

ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు



మాట్లాడుతున్న టీపీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి

జమ్మికుంట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మా తండ్రి అన్నారెడ్డి పేరిట ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతామని టీపీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం జమ్మికుంట పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని నిరుపేద ప్రజలకు సేవ చేయాలనేది తమ ట్రస్ట్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. సామూహిక వివాహాలు, ప్రతి గ్రామానికి ఒక ఫ్రీజర్, 24గంటల ఉచిత అంబులెన్స్ సేవలు అందించడమే తమ లక్ష్యం అన్నారు. ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో వివాహాలు చేసుకోవాలనుకునే వారు ఫిబ్రవరి 10వ తేది వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సైదాపూర్ పాఠశాలలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

హుజూరాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని క్లబ్‌లో ఆదివారం ఉషోదయ పాఠశాల పదో తరగతి 2004-05 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పుడు తమకు పాఠాలు బోధించిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1997-98లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది విద్యార్థులు 27 ఏళ్ల తరువాత కలుసుకొని ఆత్మీయంగా పలుకరించుకున్నారు.

చొప్పదండి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2000-01లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం నిర్వహించన సమ్మేలనంలో కలుసుకున్నారు. చిన్ననాటి ఘటనలను గుర్తు చేసుకున్నారు.

ఘనంగా ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలు

హుజూరాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వయనాడు ఎంపీ ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మేకల తిరుపతి, లావణ్య, స్వామిరెడ్డి, పుష్పలత, బాబు, రాజు, అప్సర్, శ్రీనివాస్, శంకర్, తిరుపతి, తౌసీఫ్, రియాజ్, కుమారస్వామి, రాధ పాల్గొన్నారు.

●ఇల్లందకుంట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద ఆదివారం వయనాడు ఎంపీ ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అన్నం ప్రవీణ్, తిరుపతిరెడ్డి, సంజీవరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ఓదెలు, మహేష్, పరమేష్, కిరణ్, వేణు, మల్లేష్, శివ, సాయి, రాజబాబు, స్వామి, గోపాల్‌రెడ్డి, రమేష్, మానస తదితరులు పాల్గొన్నారు.

●కరీంనగర్ అర్బన్: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, వయ నాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలను ఆదివారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, వెంకటిరెడ్డి, మామిడి సత్యనారాయణ రెడ్డి, దన్నసింగ్, పెద్దిగారి తిరుపతి, జీడి రమేష్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

రామడుగు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గడికోట మైదానంలో ఆర్‌పీఎల్ సీజన్-4 క్రికెట్ పోటీలను ఆదివారం గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బొమ్మరనివేణి తిరుమల తిరుపతి ముదిరాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గోపాల్‌గౌడ్, మాజీ సర్పంచ్ పంజాల జగన్మోహన్, సీనియర్ వాలీబాల్ ప్లేయర్, కాంగ్రెస్ నాయకుడు పంజాల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మన్నెంపల్లి గ్రామంలో నాంపల్లి బాల రాజు, నాంపల్లి రాజు స్మారక క్రికెట్ పోటీలను ఆదివారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వేణు కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ నాంపల్లి అంజనేయులు, నాంపల్లి జగన్, ఆర్గనైజర్ సంజయ్, అజయ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

హక్కుల ఉద్యమంలో మాధవరావు పాత్ర మరువలేనిది

జమ్మికుంట రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): హక్కుల ఉద్యమంలో మాధవరావు పాత్ర మరువలేనిదని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ తిరుపతయ్య అన్నారు. జమ్మికుంట పట్టణంలోని చాణక్య డిగ్రీ కళాశాలలో ఆదివారం మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో నిజామాబాద్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ 67ఏళ్ల వయసున్న మాధవరావు విద్యార్థి దశ నుంచి అభ్యుదయ రాజకీయాలు, హక్కుల రంగంలో తుది శ్వాస వరకు పని చేశారన్నారు. పలు పుస్తకాలు రచించారని వివరించారు. కార్యక్రమంలో వి సుధాకర్ రెడ్డి, పందిళ్ల రంజిత్‌కుమార్, గుంటి సామ్రాజ్యం, మోహన్, సమ్మయ్య, మొగిలయ్య, సదానందం, అవినాష్, నరహరి, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి



పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల కళాశాల, రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌లో ప్రవేశాల కోసం అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల ప్రవేశాల పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గురుకుల విద్యార్థుల కోసం ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచిందని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ స్వాతి, సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కాళహస్తి పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

● మానకొండూర్: మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన కంది రాజిరెడ్డిని బీజేపీ మండల అధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి ఎస్ వెంకటేశ్వర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

● చిగురుమామిడి: కరీంనగర్ డెయిరీలో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో జిల్లా ప్రథమ బహుమతి 11వ సారి మండలం లోని సుందరగిరి గ్రామా పాల కేంద్రానికి వచ్చిందని పాల కేంద్రం చైర్మన్ పిట్టల తిరుపతి తెలిపారు.

● హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు తొలగించడంపై ఆదివారం సింగాపూర్ మాజీ ఎంపీటీసీ భర్త గుడిపాటి జైపాల్‌రెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితులపై చర్యలు తీసుకోవాలని టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్‌కు ఫిర్యాదు కాపీని అందజేశారు.

- హుజూరాబాద్ బీఆర్ఎస్ నాయకులను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పర్యటన సందర్భంగా ఆదివారం ముందస్తుగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

- మండలంలోని సింగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

- మండలంలోని రాంపూర్, కాట్రపల్లి, పెద్దపాపయ్యపల్లి, కందుగుల, రంగాపూర్ గ్రామాల్లో జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ చేయించుకున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

● ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

- మండలంలోని పాతర్లపల్లి గ్రామానికి చెందిన బైరెడ్డి వెంకటరమణారెడ్డిని బీజేపీ మండలాధ్యక్షుడిగా నియమించారు.

● వీణవంక: ఇప్పలపల్లి గ్రామంలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ నాగరాజు శిబిరానికి హాజరైన 150 మందికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

- హైద్రాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌గౌడ్‌ను ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలపై చర్చించారు.